సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



వదలనంటోన్న వాన

భారీ వర్షాలు జిల్లాను అతలాకుతలం చేశాయి. అల్పపీడనం కారణంగా నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షం రైతులను బెంబేలెత్తిస్తోంది.

-10లో



కళ్లల్లో కారం చల్లి.. ఫైనాన్షియర్ కిడ్నాప్

ప్రొద్దుటూరులో ప్రముఖ ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డిని కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు.

-10లో

గరిష్టం/కనిష్టం
33.8/24.0

వాతావరణం

జిల్లాలో శనివారం 24.0 - 33.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

విద్యుత్ లైన్‌మెన్ సస్పెన్షన్

కడప కార్పొరేషన్: కడప డివిజన్ పరిధిలోని వెస్ట్ సెక్షన్ రామరాజుపల్లె 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బి. నూతన్ ప్రసాద్ బాబును సస్పెండ్ చేసినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు క్రమశిక్షణ చర్యల కింద సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

22 నుంచి దసరా సెలవులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని గవర్నమెంట్, మున్సిపల్, జిల్లా పరిషత్తు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా సెలవును ప్రకటిస్తున్నట్లు డీఈఓ షంషుద్దీన్ తెలిపారు. సెలవు రోజుల్లో ఎటువంటి ప్రైవేటు క్లాసులుకానీ, తరగతులుగానీ నిర్వహించ కూడదని తెలిపారు. సంబంధిత ఉత్తర్వులు ఉల్లంఘించిన యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకుంటామని డీఈఓ హెచ్చరించారు.

'బీటెక్'ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ తదితరులు

కడప ఎడ్యుకేషన్: ప్రొద్దుటూరులోని వైవీయూ వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఫస్ట్, సెకండ్, థర్డ్ బీటెక్ కోర్సులకు సంబంధించి సెమిస్టర్ ఫలితాలను శనివారం వైవీయూలో వీసీ అల్లం శ్రీనివాసరావు తన చాంబర్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మే నెలలో బి.టెక్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఫలితాలను విశ్వవిద్యాలయ వెబ్సైట్ https:www.yvuexams.in /results.aspx సందర్శించి తెలుసుకోవచ్చన్నారు.పరీక్షల విభాగాన్ని, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వీసీ ప్రశంసించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రొద్దుటూరు వైఎస్ఆర్. వైవీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. జయరామి రెడ్డి, ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ. డీన్, ప్రొఫెసర్ జి. జయ చంద్ర రెడ్డి , వైవియు పరీక్షల కంట్రోలర్ ప్రొఫెసర్ కె.ఎస్.వి. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై నిలదీత

- ఉపాధి హామీ పథకంలో నకిలీ మస్టర్, నకిలీ రికార్డింగ్, నకిలీ బిల్స్
- 8నెలల క్రితం చనిపోయిన నరసమ్మ పేరిట బిల్లులు
- ఎస్సీలచే పనులు టీడీపీ కార్యకర్తలకు బిల్లులు
- ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెన్షన్, బలవంతపు రాజీనామా
- దిశా సమీక్షలో అధికారులను నిలదీసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



కలెక్టరేట్ సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన దిశా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ శ్రీధర్, జెడ్పీ చైర్మన్ రామగోవిందు రెడ్డి, ఎమ్మెల్యేలు అమర్‌నాథ్‌రెడ్డి, సుధ, మేయర్ సురేష్‌బాబు

సాక్షి ప్రతినిధి, కడప: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమీక్షలో అధికారుల డొల్లతనంపై దుమారం రేగింది. క్షేత్రస్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలవుతోన్న తీరుపై... అధికారుల ఏకపక్ష చర్యలపై చైర్‌పర్సన్ హోదాలో కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి నిలదీశారు. జవాబు చెప్పలేక అధికారులు నీళ్ల నమిలారు. శనివారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్, దిశా మెంబర్ సెక్రెటరీ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో దిశా చైర్‌పర్సన్ కడప ఎంపీ అవినాష్‌రెడ్డి అధ్యక్షతన దిశా సమావేశం నిర్వహించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వ్యవసాయ శాఖ ఈనామ్ మార్కెటింగ్, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పీఎం కిసాన్, గ్రామీణ నీటి పారుదల వ్యవస్థ, నేషనల్ అనిమల్ డిసీస్ కంట్రోల్ ప్రోగ్రాం, నేషనల్ హైవేస్‌పై సమీక్షించారు. ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, దాసరి సుధా, జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి, మేయర్ సురేష్‌బాబు హాజరయ్యారు.

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ దిశా కమిటీ సమీక్ష సమావేశం జిల్లాలో రెండవసారి నిర్వహిస్తున్నామన్నారు. సుపరిపాలనలో ముందడుగు వేయ డానికి దిశా కమిటీ సమావేశం కీలకమైన అంశమన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, పంచాయతీరాజ్ సంస్థలు, మున్సిపల్ బాడీ, స్థానిక సంస్థలలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులందరి మధ్య మెరుగైన సమన్వయం ఉండేలా జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.

ఉల్లి, అరటి రైతులను ఆదుకోండి...

2024 ఖరీఫ్ అరటికి మే 25 వరకూ ఇన్సూరెన్సు కవర్ అవుతోంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా మార్చి 22, 23తేదీల్లో భారీ ఎత్తున అరటి తోటలు ధ్వంసం అయ్యాయి. జిల్లాకు ఆటోమేటిక్ వెదర్ బేస్ ఇన్సూరెన్సు కవర్ కావాల్సి ఉంది. ఆటోమేటిక్ వెదర్ స్టేషన్స్ పనిచేయడం లేదు. నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్సు కవర్ కావడంలేదు. ఇన్‌పుట్ సబ్సిడీ మాత్రమే ప్రతిపాదనలు పంపారు. రైతులకు ఇన్సూరెన్సు రావాలి కదా?నని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రత్యేకంగా జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అలాగే ఉల్లి రైతులకు మార్కెటింగ్ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ సమా ధానమిస్తూ జిల్లాలో 12 వేల ఎకరాల్లో ఉల్లి సాగులో ఉందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉల్లి ఎగుమతులకు అడ్డంకులు రావడంతో సమస్య వచ్చిందని వివరించారు.

హౌసింగ్‌లో పురోగతి ఏదీ?: మేయర్ సురేష్‌బాబు

కడప నగరంలో 21 వేల ముంది పేదలకు హౌసింగ్ పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేశారు. ఇంత వరకు గృహ నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయని, 16నెలలుగా ఎలాంటి పురోగతి లేదు. ఎక్కడ లోపం ఉందని కడప నగర మేయర్ సురేష్ బాబు సభ దృష్టికి తీసుకువచ్చారు. 35ఏళ్ల క్రితం మంజూరు చేసిన హౌసింగ్ ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. వాటి స్థానంలో కొత్తవి లేదా మెయింటిన్సుకు బిల్లులు మంజూరు చేయాలని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా కోరారు. అట్లూరు మండలం ఎస్.వెంకటాపురం ఎస్సీ కాలనీలో ఇలాంటి పరిస్థితి ఉందని ఒకసారి విజిట్ చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రజాప్రతినిధులకు ఎన్ఆర్ఈజీఎస్ పనులు వివరించండి:

ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మండల పరిషత్, గ్రామ పంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనుల వివరాలు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని జెడ్పీ చైర్మన్ రామగోవిందురెడ్డి కోరారు. నిర్వహణలో రిజర్వేషన్ పద్ధతిని పాటిస్తూ సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు అవకాశం కల్పించాలని, పనుల ప్రతిపాదనలను వారి దృష్టికి తీసుకురావాలని కోరారు. జగనన్న కాలనీలలో లబ్ధిదారుకు బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చనిపోయిన వారిపేరిట కూడా బిల్లులు!

ఉపాధి హామీ పథకంలో అనేక అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, ఫేక్ మస్టర్లు, ఫేక్ రికార్డింగ్, ఫేక్ ఐడీ కార్డులు, ఫేక్ బిల్లులు ఉన్నాయని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. ముద్దనూరు మండలం నల్లబల్లె గ్రామంలో ఒకే ఫోటోతో మస్టర్లు అప్‌లోడ్ చేశారు. బి.మఠం మండలం పలుగురాళ్లపల్లెలో నరసమ్మ చనిపోయి 8నెలలు అవుతోంది. ఆమె పేరిట బిల్లులు చెల్లించారు. కొనరాజుపల్లెలో ఎస్సీలతో పనులు చేయించారు. టీడీపీ కార్యకర్తల పేరిట బిల్లులు ఇస్తున్నారు. చక్రాయపేట మండలంలో మహాదేవపల్లెలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇలాంటి జిల్లా వ్యాప్తంగా 300 ఫిర్యాదులు వచ్చాయని ఎంపీ ధ్వజమెత్తారు. అందులో ఐదు మాత్రమే కలెక్టర్‌కు ఆధారాలతో ఇస్తున్నానని ఆయన తెలిపారు. అకారణంగా ఫీల్డ్ అసిసెంట్లును తొలగిస్తున్నారని.. అప్పీల్స్ 30రోజుల్లో క్లియర్ చేయాలి...6నెలలు అవుతోన్నా ఎందుకు చేయడం లేదని ఎంపీ నిలదీశారు. కోర్టు ఉత్తర్వులను సైతం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరైందేనా? అని ప్రశ్నించారు. సోషల్ ఆడిట్ అనంతరం అధికారికంగా 42 ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెన్షన్ చేసినట్లు డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి వెల్లడిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెన్షన్ చేసినట్లు వివరాలు ఎందుకు అప్‌లోడ్ చేయలేదని ఎంపీ నిలదీశారు. ఆయా ఫిర్యాదులపై అధికారుల నోట మాట లేకపోగా, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చెప్పుకొచ్చారు.

అక్రమ మైనింగ్ అరికట్టండి...

జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగుతోందన్న ఫిర్యాదులు అందుతున్నాయని.. మైనింగ్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అక్రమ మైనింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. నిల్వ ఉన్న బెరైటీస్‌ను దోచుకెళ్లారని, దోచుకెళ్లిన బరైటీస్‌ను గుర్తించి, రికవరీ చేయాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చినా మైనింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వేంపల్లె, వేముల మండలాలల్లో క్రేన్లు బిగించి అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని తద్వారా కోట్లాది రూపాయాలు రాయల్టీ రూపేనా లభించాల్సిన ఆదాయం కోల్పోతున్నామని వెల్లడించారు. కలెక్టర్ శ్రీధర్ స్పందిస్తూ విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంటుతో కలిసి దాడులు చేయాలని మైనింగ్ ఏడీని ఆదేశించారు. కడపలో అనుమతులు ఉన్న గ్రావెల్ మైన్‌లకు రాయల్టీలు ఇవ్వడం లేదని, అక్రమ గ్రావెల్ మైనింగ్ యథేచ్ఛగా చేపట్టుతున్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదని మేయర్ సురేష్‌బాబు ఆరోపించారు.

అర్హులందరికీ మినీ గోకులాలు: కలెక్టర్ శ్రీధర్

మినీ గోకులం అర్హులందరికీ మంజూరు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ వివరించారు. 2025–26కు 1750 మినీ గోకులాలు మంజూరు కాగా, 800 ఇప్పటికీ ఖాళీలు ఉన్నాయని చెప్పారు. మరో 1750 గోకులాలు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశా కమిటీ సమావేశం అవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిధుల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు పథకాలు ఏ విధంగా అమలు అవుతున్నాయి. ఈ కమిటీ ద్వారా ప్రజాప్రతినిధులు పలు సలహాలు సూచనలు తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి వెల్లడిస్తామని తెలిపారు. జాతీయ స్థాయిలో చీనీ దిగుబడి మార్కెటింగ్ చేసుకునే వెసులుబాటుతో ఈనాం పద్ధతిని జిల్లాలో అవలంబిస్తున్నామన్నారు. మార్కెటింగ్ నిర్వహణలో దక్షిణ భారత దేశంలోనే చీనీ పంటకు పులివెందులను ఒక ప్రసిద్ధ వేదికగా తీసుకురానున్నట్లు తెలిపారు. దిశా కమిటీ సభ్యులు బద్వేల్, పులివెందుల మున్సిపల్ చైర్మన్లు రాజగోపాల్‌రెడ్డి, వరప్రసాద్, వీరపునాయునిపల్లె ఎంపీపీలు రఘునాథరెడ్డి, వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సురేష్‌యాదవ్, కల్లూరు సర్పంచ్ శివలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఈ వైద్య శిబిరాలు అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ లో స్పెషలిస్ట్ వైద్యులతో నిర్వహించనున్నట్లు వివరించారు. మహిళలకు, కిశోర బాలి కలకు, చిన్నపిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిం నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న బుశెట్టి రాంమోహన్‌రావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో 136వ దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశామని..ఈ ఏడాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు అట్టహాసంగా నిర్వహించనున్నామని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్ రావు తెలిపారు. ఆలయంలో శనివారం ఉత్సవ వివరాలను కమిటీ సలహాసభ్యులు బుశెట్టి రాజశేఖర్, ఎస్‌వీ గోపాలకృష్ణ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరన్నవరాత్రుల సందర్భంగా రోజూ అమ్మవారి అలంకారాలు నిత్యనూతనంగా భక్తులకు కనువిందు చేస్తాయన్నారు. సోమవారం దసరా ప్రారంభం సందర్భంగా ఉదయం వాసవీకన్యకా పురాణాన్ని తెచ్చే వేడుకలో హర్యానా భంభంభోలే అఘోరాలు, భోపాల్ శివశక్తి డ్రమ్స్, కోదండరామ కోలాటం ఉంటుందన్నారు. 29న బిందె సేవ రోజున చిక్‌మంగుళూరుకు చెందిన కళాకారుల ప్రదర్శనలు, అక్టోబరు 2న విజయ దశమి సందర్భంగా శమీదర్శనం, తొట్టి మెరవణి వేడుకలో పాలకొల్లు బ్యాండ్, కోలాటం, డూప్స్, హర్యానా కళాకారుల వేషధారణలు, కేరళ సింగారిమేళం, కాంతార కళాకారుల ప్రదర్శనలు, బాణసంచా పేలుళ్లు అలరిస్తాయన్నారు. అలాగే లోకకళ్యాణార్థం రోజూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజాకార్యక్రమాలు, వేద పఠనం, జపహోమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది దసరా 11 రోజులు రావడంతో 9వ రోజున అమ్మవారిని బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరిస్తున్నామన్నారు. 4 రోజులు సినీ డైరెక్టర్ గోపి అమ్మవారికి ప్రత్యేక సెట్టింగ్‌లు వేస్తున్నారన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు దేవీ శరన్నవ రాత్రి వేడుకల్లో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, మల్లెంకొండు ప్రతాప్, కోశాధికారి జాలాధి పరమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య జిల్లా అందరి బాధ్యత

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



మొక్కనాటి నీరు పోస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాను కాలుష్య రహిత ఆరోగ్య జిల్లాగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ 'స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని పురస్కరించుకునిఅధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 3వ శనివారం చేపడుతున్న స్వచ్ఛ దివస్ కార్యక్రమంతో స్వచ్ఛత వైపు అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలోని అన్ని బ్లాకుల వద్ద ఆయా శాఖల అధికారులు, సిబ్బంది స్వచ్ఛ దివస్ నిర్వహించారు. డీఆర్వో , ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన దళిత వ్యతిరేక పార్టీలు





సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు, సమావేశానికి హాజరైన నాయకులు , పార్టీ శ్రేణులు

- కూటమి రాకతో ఆ వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా నష్టం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు

కడప కార్పొరేషన్: సీఎం చంద్రబాబు దళిత వ్యతిరేకి అని.. టీడీపీ, జనసేన సిద్ధాంతం, భావజాలంతో దళితులకు నష్టమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు అన్నారు. విజయవాడలోని 125 అడుగుల డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట లక్ష మంది దళితులతో ప్రదర్శన చేయనున్నామని ఆయన వెల్లడించారు. శనివారం పాతరిమ్స్ ఆవరణంలోని బీసీ భవన్‌లో జరిగిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 35 మంది సభ్యులతో జిల్లా కమిటీతో పాటు ఏడు నియోజకవర్గాల్లో, మున్సిపాలిటీల్లో, 36 మండలాల్లో, పంచాయతీల్లో కమిటీలు పూర్తి చేయాలన్నారు. దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా...అని తన మనసులో దళితులపై ఉన్న వివక్షను చంద్రబాబు బయటపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. పిఠాపురంలో దళితులను గ్రామ బహిష్కరణ చేసినా పవన్ మాట్లాడకుండా దళితులపై వ్యతిరేకతను చాటుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీతోనే దళితులకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్ల రాజకీయంగా దళితులకు నష్టం జరిగిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 38 సంక్షేమ పథకాల ద్వారా దళితులకు కోట్లాది రూపాయల లబ్ధి చేకూరిందని తెలిపారు.

చంద్రబాబు దళిత ద్రోహి

వైఎస్ కుటుంబానికి దళితులంతా బంధువులని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ముద్దుబిడ్డలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథరెడ్డి అన్నారు. చంద్రబాబు దళిత ద్రోహి అని, ఆయన టక్కుటమారాలను దళితులు గమనించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

అంబేడ్కర్ భావజాలానికి అనుగుణంగా జగన్ పాలన



దళితులంతా సంఘటితంగా ఉండి తమ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవాలని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ అన్నారు. కూటమి ప్రభుత్వం అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని, వైఎస్సార్ సీపీపై బురదజల్లడమే లక్ష్యంగా పనిచేస్తోందని మండిపడ్డారు. విద్య ఒక్కటే మన జీవితాల్లో మార్పు తెస్తుందని అంబేద్కర్ చెప్పారని, వైఎస్ జగన్ కూడా విద్య, వైద్యాన్ని అణగారిన వర్గాల అభ్యున్నతికి పునాది రాళ్లుగా ఉపయోగించారన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా పనిచేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. దళితులు శుభ్రంగా ఉండరు, స్నానం చేయరు అంటూ బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేశారు.

- కూటమి ప్రభుత్వ పాలనలో దళితులు ఆత్మ గౌరవంతో బతకడం లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కనకారావు అన్నారు. మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్లతో పాటు 15 మందికి రాష్ట్ర స్థాయి చైర్మన్లను చేసిన ఘనత వైఎస్ జగన్‌దేనని చెప్పారు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రక్షణ, భద్రత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిశోర్ బూసిపాటి అన్నారు. కూటమి పాలనలో ఏ వర్గ ప్రజలు కూడా సంతోషంగా లేరని, దళితులపై దాడులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.
- దళితులు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దళితులకు గౌరవం లభించిందని, కూటమి ప్రభుత్వంలో ఆ గౌరవం కరువైందన్నారు.
- 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిపాలవడంతో దళితుల బతుకులు దుర్భరమయ్యాయని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా పరిశీలకులు కె. చెంగయ్య అన్నారు. దళితుల జీవితాలు బాగుపడాలంటే ఓటు అనే ఆయుధంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దళితుల సత్తా చూపాలని పిలుపునిచ్చారు.

దళితుల సంక్షేమం వైఎస్సార్, జగన్ హయాంలోనే...

దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిల పాలనలోనే దళితుల సంక్షేమం, అభివృద్ధి జరిగిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు అన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, పింఛన్లు వంటి పథకాల వల్ల దళితులకు ఎక్కువగా లబ్ధి చేకూరిందన్నారు.

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, దళిత నాయకులు సీహెచ్ వినోద్ కుమార్, ఎం.సుబ్బరాయుడు, కె. శరత్‌బాబు, డేనియల్ ప్రదీప్, బి. మరియలు, కె. బాబు, బండి ప్రసాద్, త్యాగరాజు, ఆర్. చెన్నయ్య తదితరులు మాట్లాడారు. అంతకుముందు వారు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్, వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఎస్. యానాదయ్య, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యరెడ్డి, గల్ఫ్‌కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు బి. వేణుగోపాల్ నాయక్, మహిళా విభాగం అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, పుల్లయ్య(బద్వేల్), చిట్టిబాబు(జమ్మలమడుగు), భాస్కర్(పులివెందుల) తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగ్గురిపై చీటింగ్ కేసు

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన విజయభాస్కర్‌రెడ్డితోపాటు కుమార్తె రూప తన్మయి, సుజిత్‌కుమార్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ బి.రామకృష్ణ తెలిపారు. సీఐ వివరాల మేరకు.. అరవింద్‌నగర్‌కు చెందిన నిత్య పద్మావతి 2019లో ఐదు ఆయిల్ ట్యాంకర్లను కొనుగోలు చేశారు. వాటి నిర్వహణ బాధ్యత విజయభాస్కర్ రెడ్డికి అప్పగించారు. ఆయన నిత్య పద్మావతి దగ్గర సంతకాలు చేసిన చెక్కు, లెటర్ ప్యాడ్‌లను నమ్మకంగా ఇప్పించుకున్నాడు. కుట్రపన్ని దాదాపు రూ.90 లక్షల మేర తాను, తమ ఇద్దరు పిల్లల ద్వారా డబ్బు డ్రా చేసుకుని అవసరాలకు ఖర్చు చేసుకున్నారు. చివరకు ఆయిల్ ట్యాంకర్లకు సంబంధించిన ఈఎంఐలను తన చేతనే కట్టించడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. ఈ సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు మైనర్ల అరెస్టు

వేంపల్లె : స్థానిక పిల్లస్వామి గుట్ట సమీపంలోని జగనన్న కాలనీలో జరిగిన చోరీ కేసులో బంగారు రికవరీ చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన జగనన్న కాలనీలో వాణి తన ఇంటికి తాళం వేసి వెళ్లారు. అదే కాలనీకి చెందిన ఖాదర్‌వలి, మరో ఇద్దరు మైనర్లు పట్టపగలే ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో బంగారు, వెండి చోరీ చేశారు. విచారించి కడప–పులివెందుల బైపాస్ రోడ్డులోని హనుమాన్ జంక్షన్ వద్ద ఎస్ఐ తిరుపాల్‌నాయక్, సిబ్బంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 66.900గ్రాముల బంగారు ఆభరణాలు, 118 గ్రాముల వెండి గొలుసులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పులివెందుల లయోలా కళాశాల అధ్యాపకుడి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న ఉదయ్‌కుమార్

పులివెందుల టౌన్ : అంతర్జాతీయ సదస్సులో పులివెందుల లయోలా డిగ్రీ కళాశాల జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.ఉదయ్‌కుమార్ ప్రతిభ చూపారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు రేవా యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో 9 దేశాల శాస్త్రవేత్తలు పాల్గొని 200 ప్రదర్శన పత్రాలు సమర్పించారు. లయోలా కళాశాల అసిస్టెంట్ అధ్యాపకుడు ఉదయ్ కుమార్ లైఫ్ సైన్స్ విభాగంలో సమర్పించిన ఉపాధ్యాయ కేటగిరీ పత్రం ద్వితీయ బహుమతికి ఎంపికైంది. అతిథుల నుంచి ఆయన బహుమతి అందుకున్నారు. ప్రిన్సిపల్ జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వనచిన్నప్ప ఉదయ్‌ను అభినందించారు.

వదలనంటోన్న వాన



చింతలజూటూరులో వర్షాలతో దెబ్బతిన్న ఉల్లి గడ్డలు



పెద్దజూటూరులో వర్షానికి పడిపోయిన అరటి తోట



ఎర్రగుంట్ల ప్రాంతంలో పొంగి పొర్లుతున్న వంకలు

- జిల్లాలో నాలుగు రోజుల నుంచి వర్షాలు
- జోరుగా ప్రవహిస్తున్న పెన్నా, కుందూనదులు
- 942 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- నీటి నిల్వలు, దోమలతో అల్లాడుతున్న జనం

కడప అగ్రికల్చర్/వేముల/పెనగలూరు : కడప జిల్లా భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. అల్పపీడనం కారణంగా గత నాలుగు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా వద్దన్నా వర్షం కురుస్తూ రైతులను బెంబేలెత్తిస్తోంది. చాలా ప్రాంతాల్లో కుంటలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వేంపల్లిలో అత్యధికంగా శుక్రవారం రాత్రి 96.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఎర్రగుంట్లలో 84, పెద్దముడియంలో 85, జమ్మలమడుగులో 80.4, వీఎన్‌పల్లిలో 73.4, వేములలో 72.4, చక్రాయపేటలో 67.2, ప్రొద్దుటూరులో 57.8చ, పులివెందులలో 36, ముద్దనూరులో 35.4, తొండూరులో 32.2, ఒంటిమిట్టలో 29, మైలవరంలో 28.6, సికెదిన్నెలో 22.3, కడపలో 17.2, లింగాలలో 15.2, వల్లూరులో 14.4, సింహాద్రిపురంలో 13.2, రాజుపాలెంలో 12.2, పెండ్లిమర్రిలో 9.2, కమలాపురంలో 8.8, చాపాడులో 8.4, కొండాపురంలో 8.2, ఖాజీపేటలో 7.4, సిద్దవటంలో 7.2, చెన్నూరులో 2.2, దువ్వూరులో 2.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. నదీపరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

■ ఎర్రగుంట్ల మండలం వై.కోడూరు వలసపల్లి, చిలంకూరు, మాలపాడు వంకలు శుక్రవారం ఉధృతంగా ప్రవహించాయి, కోడూరు వంకకు వరద నీరు చేరడంతో వేంపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. ఎర్రగుంట్లలోని 33 కేవీ, 320 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్లతోపాటు డీఈఈ కార్యాలయంలోకి నీరు చేరింది.

■ రాజుపాలెం మండలం పర్లపాడు ఎస్సీ కాలనీలో జలమయమైయింది. రాజుపాలెం, వెంగలాయపల్లి గ్రామాల మధ్య మడవంకకి వర్షపునీరు భారీగా చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

■ గత నాలుగేళ్లుగా నీరు లేక వెలవెలబోయిన చెరువు ఒంటిమిట్ట చెరువుకు వరదనీరు వచ్చి చేరుతోంది.

■ పెన్నా, కుందూ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నీరు అధికంగా చేరడంతో సిద్దవటం వద్ద లో లెవల్ బ్రిడ్జిపై నీరు పొంగి ప్రవహించింది.

తోటలలో కుళ్లిపోతున్న ఉల్లిగడ్డలు

జిల్లాలోని పెద్దముడియం, ప్రొద్దుటూరు, కమలాపురం, వల్లూరు, ఎర్రగుంట్ల, వేంపల్లి మండలాలలోని 32 గ్రామాల పరిధిలో 1101 మంది రైతులకు సంబంధించిన 942.38 హెక్టార్లలో వరి, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, సోయాబీన్, మినుము, పత్తి పంటలకు ప్రాథమికంగా నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా తయారు చేశారు. ఇందులో భాగంగా 662.2 హెక్టార్లలో వరి, 10 హెక్టార్లలో జొన్న, 10 హెక్టార్లలో మొక్కజొన్న, 137.68 హెక్టార్లలో వేరుశనగ, 11.6 హెక్టార్లలో సోయాబీన్, 28.2 హెక్టార్లలో మినుము, 4.5 హెక్టార్లలో పత్తిపంటలు దెబ్బతిన్నాయి. అలాగే ఉద్యాన పంటలకు సంబంధించి ఉల్లి, పూలు పంటలు దెబ్బతిన్నట్లు పలువుర ఉద్యాన రైతులు తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలో 3660 ఎకరాలలో ఉల్లి పంట సాగైంది. ఈ ఏడాది జూన్ మొదటివారంలో పంటలు వేయడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు భావించారు. వ్యాపారులు కొనుగోలుకు మొగ్గు చూపకపోగా, ప్రభుత్వం మొండిచేయి చూపింది. రైతులు వేచి చూశారు. ఇంతలోనే వర్షాలు కురవడంతో తోటల్లోనే ఉల్లిగడ్డలు కుళ్లిపోతున్నాయి. 1500 ఎకరాల్లో ఉల్లి పంట దెబ్బతిందని ఉద్యాన అధికారులు తేల్చారు. పెద్దజూటూరులో చెన్నకేశవరెడ్డి 3.50ఎకరాలలో సాగు చేసిన అరటి పంట వర్షాలకు నేల రాలింది.



ఎర్రగుంట్ల 33 కేవీ సబ్‌స్టేషన్‌కు చేరిన వర్షం నీరు



ఎర్రగుంట్లలో వర్షపు నీటికి దెబ్బతిన్న పత్తి పంట



రాజుపాళెం: పర్లపాడులో 5 అడుగుల మేర నీటిలో ఉన్న శివాలయం



సోమశిల బ్యాక్ వాటర్‌తో గుంజనేరు పొంగి పంట పొలాల్లోకి చేరిన నీరు

సోమశిల జలాలతో మునిగిన పొలాలు

పెనగలూరు: సోమశిల వెనుక జలాలు పెరగడంతో సిరివరి గ్రామానికి చెందిన వందల ఎకరాల పంట నీట మునిగింది. మామిడి తోటల్లోకి నీరు చేరడంతో చెట్లు చనిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమశిల ప్రాజెక్టు సామర్థ్యం 78 టీఎంసీలు కాగా 72 టీఎంసీలు నిల్వచేశారు. దీంతో సిరివరం, ఎస్‌ఆర్.పురం గ్రామంలోని చాలా పొలాలకు నీరు చేరింది. వారం పది రోజులలో కోసేందుకు వరి ప ంట సిద్ధంగా ఉండగా. నీట మునగడంతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైంది. అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉల్లి గడ్డలు కుళ్లిపోతున్నాయి



నేను రెండు ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశా. రూ.1.50 లక్షల మేర పెట్టుబడి పెట్టాను. పంటకాలం పూర్తికావడంతో ఉల్లిగడ్డలు పీకివేశా. వర్షాలకు తడిచి ఉల్లిగడ్డలు కుళ్లిపోతున్నాయి. దీంతో ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయాను.

– చలమారెడ్డి, ఉల్లి రైతు, చింతలజూటూరు

ధర లేక అమ్మలేదు



ఉల్లి సాగు చేసి పంట కాలం పూర్తయింది. నాలుగు ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశాను. రూ.3 లక్షలకు పైనే పెట్టుబడులు పెట్టాను. ధరల కోసం ఎదురుచూస్తున్నా. ఇంతలోనే వర్షాలు కురవడంతో గడ్డలు కుళ్లిపోతున్నాయి. ఇలాగే వర్షాలు కురిస్తే పంట వదులుకోవాల్సిందే.

– ద్వారకనాథ్‌రెడ్డి, ఉల్లిరైతు, వేల్పుల

ఉల్లి తోటలు దెబ్బతింటున్నాయి

తుపాన్ వర్షాలతో ఉల్లి తోటలు దెబ్బతింటున్నాయి. తోటలలో పీకి వేసిన ఉల్లి గడ్డలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పీకి వేయని ఉల్లిగడ్డలు కూడా భూమిలో కుళ్లిపోతున్నాయి. వర్షాలతో ఉల్లి రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. 1500ఎకరాలలో పంట దెబ్బతింది.

– రాఘవేంద్రారెడ్డి, ఉద్యాన శాఖాధికారి, పులివెందుల

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

10 మోటార్ బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లు, నిందితుడితో డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సిబ్బంది

మైదుకూరు : తనను బెదిరించి తన మోటార్ బైక్‌ను అగంతుకుడు ఎత్తుకెళ్లాడని ఓ భవన నిర్మాణ కార్మికుడు చేసిన ఫిర్యాదు ఓ అంతర్ రాష్ట్ర దొంగను పట్టించింది. బద్వేల్ ఎన్జీఓ కాలనీ వాసి బ్రహ్మదేవి రాజశ్రీ గణేష్‌ను బ్రహ్మంగారిమఠం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.5 లక్షల విలువచేసే పది మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నారు. మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్ వివరాల మేరకు.. ప్రొద్దుటూరులోని వివేకానంద కాలనీకి చెందిన షేక్ హుస్సేన్‌షా బేల్దారిగా పనిచేస్తున్నారు. బ్రహ్మంగారిమఠం ఈశ్వరీదేవి గుహ వద్ద ఈ నెల 16న పనులకు వెళ్లి కొద్ది దూరంలో బైక్ పార్కింగ్ చేశాడు. సాయంత్రం వచ్చి చూడగా.. నిందితుడు రాజశ్రీ గణేష్ తన బైక్‌ను స్టార్ట్ చేస్తుండడంతో హుస్సేన్‌షా ఎందుకు స్టార్ట్ చేస్తున్నావని ప్రశ్నించాడు. పక్కకు తప్పుకోకుంటటే చంపేస్తానంటూ చాకుతో బెదిరించి బైక్‌లో పరారయ్యాడు. బాధితుడు బ్రహ్మంగారిమఠం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో నిందితుడు రాజశ్రీ గణేష్‌ను పోలీసులు అనుమానించి విచారించారు. విచారణలో హుస్సేన్‌షా మోటార్ బైక్ అని తేలడంతో మరింత విచారణ చేశారు. దీంతో రాష్ట్రంతోపాటు తెలంగాణలోని పలు స్టేషన్ల పరిధిలో తొమ్మిది మోటార్ బైక్‌లు చోరీ చేసినట్లు తెలిసింది. ఓ పాడుబడిన షెడ్‌లో నిందితుడు దాచిన పది మోటార్ బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతేగాక కడప, ఒంటిమిట్ట, నందలూరు ప్రాంతాల్లో ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీ చేసినట్లు నిందితుడిపై కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా నిందితుడిని పట్టుకున్న సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. కానిస్టేబుళ్లు మధుసూదన్ రెడ్డి, హుస్సేనయ్య, బ్రహ్మేంద్రలకు రివార్డులను అందజేశారు.

ప్రొద్దుటూరులో లేఖ కలకలం

బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు వసూలుచేస్తున్నారని ఆరోపణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గొర్రె శ్రీనివాసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ప్రొద్దుటూరు పట్టణంలో కొందరు బ్లాక్ మెయిల్ చేస్తూ జేబులు నింపుకొంటున్నారని పట్టణ ప్రముఖులపై ఏకే.రామాంజనేయులు రాసిన లేఖ శనివారం కలకలం సృష్టించింది. లేఖలో వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో బీజేపీ నాయకుడు గొర్రె శ్రీనివాసులు బ్లాక్ మెయిల్ దందాకు పాల్పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. రెండు దశాబ్దాల కిందట అగస్త్యేశ్వరస్వామి ఆలయ నిర్మాణ వివాదంలోనూ, మిట్టా పాపయ్య సత్రం, నందినీ క్లాత్ మార్కెట్ విషయంలోనూ వివాదాలను ఆసరాగా తీసుకుని గోసంగి వెంకటసుబ్బారెడ్డి, గొర్రె శ్రీనివాసులు బ్లాక్ మెయిల్‌కు పాల్పడగా వారికి బుశెట్టి రాంమోహన్‌రావు సహకరించారని ఆరోపించారు. ధారా అపార్ట్‌మెంట్ నిర్మాణంపై లెక్కలేనని పిటీషన్లు పెట్టి బ్లాక్ మెయిల్ చేసి డబ్బు సంపాదించారని ఆరోపించారు. డీఏడబ్ల్యూ కళాశాల వివాదంలో ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పైనా డీఎల్.రవీంద్రారెడ్డితో ఫిర్యాదు చేయించి రూ.50 లక్షల వరకూ వసూలు చేశారన్నారు. గోపీ రైస్‌మిల్లుపై వందల కొద్దీ పిటీషన్లు, ఆర్టీఐ అప్లికేషన్లు పెట్టి రూ.8కోట్లు అక్రమంగా సంపాదించారని, బొల్లవరంలో పల్లేటి సుహాసినిని మధ్యపెట్టి డబ్బు సంపాదించారని ఆరోపించారు. ఇందులో టీడీపీ నాయకుడు ఉక్కు ప్రవీణ్ అనుచరుడు వాటర్‌ప్లాంట్ రాము, నీలకంఠారెడ్డి ఉన్నారన్నారు. చౌటపల్లె నికల్సన్ దొరకు చెందినదిగా చెప్పబడుతున్న మూడు ఎకరాల స్థలాన్ని దొంగగా రిజిస్ట్రేషన్ చేయించుకుని కబ్జా చేయాలని యత్నించినట్లు పేర్కొన్నారు. నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, మరికొందరు వేసిన వెంచర్లపై ఆర్టీఐ యాక్ట్ పెట్టి బెదిరించారన్నారు. 2023లో రాజా ఫౌండేషన్‌పై వారి కళ్లు పడ్డాయని, చిన్నజీయర్‌స్వామిని పరిచయం చేసుకుని కమిటీలో తమ పేర్లను ఎక్కించుకున్నారని, తమకు రూ.75 కోట్ల విలువైన భూములను అప్పజెప్పాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నాయకుడు గొర్రె శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ అక్రమంగా రూపాయి తీసుకున్నట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని, నిరూపించలేని పక్షంలో ఆరోపణలు చేసిన వ్యక్తులు రాజకీయాలకు ముగింపు పలకాలని కోరారు. శివాలయం సెంటర్ వద్ద బహిరంగ చర్చా వేదికకు తాము సిద్ధమన్నారు. కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా రాజకీయ ప్రత్యర్థులు ఇలాంటి ఆరోపణలు చేయించారని, దందాలు ఎవరు చేశారో ప్రజలకు తెలుసునన్నారు. గోసంగి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 16న హెడ్ పోస్టాఫీసులో లేఖ పోస్టు చేశారని, ఎక్కడి నుంచి లేఖ వచ్చింది అడ్రెస్ లేదన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకే ఇలా చేశారన్నారు. అనంతరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమపై ఆరోపణలు చేసిన వారిపై విచారించాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

పరిశుభ్రతే ప్రగతికి సోపానం

ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



మొక్కనాటి నీరు పోస్తున్న ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నపుడే ఆరోగ్యంగా జీవించవచ్చని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ స్టేడియం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని మొక్క నాటారు. అనంతరం తమ వంతు కృషి చేస్తామని పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ మొక్కలు భూమిపై కాలుష్యాన్ని తగ్గించేందుకు, ప్రాణవాయువు శాతాన్ని పెంచేందుకు ఉపయోగపడతాయన్నారు. మొక్కలతో ఆహ్లాద వాతావరణం ఉంటే ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో, సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చని తెలిపారు. సమాజ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ(ఏఆర్) బి.రమణయ్య, డీఎస్పీ ఎస్.సుధాకర్, ఎ.శివరాముడు, శ్రీశైలరెడ్డి, టైటస్, సోమశేఖర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో యూనియన్ల మధ్య ఘర్షణ



గాయం చూపుతున్న మనోహర్

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో యూనియన్ల మధ్య శుక్రవారం ఘర్షణ చోటుచేసుంది. టీఎన్‌టీయూసీ యూనియన్‌కు చెందిన మనోహర్, పులి సుధాకర్‌రెడ్డిలకు స్వల్పంగా గాయలయ్యాయి. యూనియన్ నాయకులు కలమల్ల పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేయగా పోలీసులు సర్ది చెప్పాల్సి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల డిమాండ్ల సాధన కోసం 23 యూనియన్లు కలిసి జేఏసీగా ఏర్పడిడి ఈ నెల 15వ తేదీ నుంచి నిరసన చేపట్టారు. ప్రభుత్వంలో భాగమైన టీఎన్‌టీయూసీ, బీఎంఎస్ యూనియన్లు కాంట్రాక్టు కార్మికుల కోసం వేరుగా నిరసన ప్రదర్శన నిర్వహించాయి. శనివారం జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం కాగా, అదే సమయంలో గేటు బయట టీఎన్‌టీయూసీ, బీఎంఎస్ యూనియన్లు నిరసన చేపట్టాయి. విధులకు వెళ్తున్న ఉద్యోగ, కార్మికులను రెండు యూనియన్ల నేతలు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుని తోపులాట జరిగింది. టీఎన్‌టీయూసీ యూనియన్‌కు చెందిన మనోహర్, పులి సుధాకర్‌రెడ్డిలకు గాయాలయ్యాయి. దీంతో యూనియన్ నేతలు కలమల్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ అంతా కలిసి చర్చించుకుని సర్దుబాటు అయ్యారు. జేఏసీ నేతలు క్షమాపణ చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.



ఆర్టీపీపీలో ఘర్షణ పడుతున్న యూనియన్ నాయకులు

ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపిక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా జట్ల ఎంపిక నిర్వహించామని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరి చంద్రమోహన్‌రాజు తెలిపారు. చెన్నూరు మండలం రామన్నపల్లె జెడ్పీ హైస్కూల్‌లో అండర్–19 ఘట్కా(కత్తిసాము), కలవరియ పట్టు (కర్రసాము) జిల్లా జట్లకు ఎంపికలు నిర్వహించగా 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

కలవరియ పట్టు విభాగంలో

బాలికల జట్టు : ఆర్.శ్రీజ, వి.రూపశ్రీ, బి.మానసరావు, ఎస్.ధోనేశ్వర్‌రేఖ, ఎస్.ప్రణవి, పి.శశికళ, ఎస్.శిరీష, స్టాండ్‌బై గా శ్రావ్య **బాలుర జట్టు :** సిపి. నందనమణికుమార్‌రెడ్డి, జి.గంగిరెడ్డి, ఎస్.సాయిచైతన్యకుమార్‌రెడ్డి, బి.శివశంకర్, ఓ.నవీన్‌కుమార్, ఎ.భరత్‌కుమార్, వై.వరుణ్, స్టాండ్‌బైగా ఎస్.చెన్నకేశవ, ఎస్.ఇమ్రాన్ ఘట్కా విభాగంలో **బాలికల జట్టు :** డి.నందిని బి.శ్రీజ, టి.జ్యోత్న, డి.త్రిషారిక, వి.రూపశ్రీ, ఎం.ప్రణవి, ఎం.ధోనేశ్వరి రేఖ, టి.భారతి, స్టాండ్‌బైగా వై.అసీఫా, డి.శశికళ ఎన్నికయ్యారు. **బాలుర జట్టు:** బి.నాగచైతన్య, సాయిచైతన్యకుమార్‌రెడ్డి, మహీధర్‌నందన్, బి.శివశంకర్, సి.చిన్నరెడ్డయ్య, ఎస్.ఉబైదుల్ల, ఓ.నవీన్‌కుమార్, స్టాండ్‌బైగా ఎం.సుశాంత్, ఎస్.చెన్నకేశవ.

చిరుధాన్యాలతో ఆరోగ్య భాగ్యం

కడప అగ్రికల్చర్ : చిరు ధాన్యాలతో మానవాళికి ఆరోగ్యం కలుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్ అన్నారు. ఊటకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం చిరుధాన్యల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగి, కొర్ర, సజ్జ, జొన్నలు వంటి చిరుధాన్యాలు తక్కువ ఖర్చుతో సాగు చేసి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. జేడీఏ శివనారాయణ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చునని, శరీరానికి కావలసిన బోలెడు విటమిన్లు, పోషకాలు అందుతాయన్నారు. మెప్మా పథక సంచాలకులు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రాసెసింగ్ యూనిట్‌లను రైతు సోదరులు సామూహికంగా ఏర్పాటుచేసుకొనే వెసులుబాటును మెప్మా కల్పిస్తోందని తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకరరెడ్డి, ఆదినారాయణ స్వామి, శాస్త్రవేత్తలు యం.రెడ్డికుమార్, సరళ, శాంతిప్రియ, బి.బాలకృష్ణ, క్రిష్ణప్రియ, డా.ప్రశాంతి, శిల్పకళ, డా.టి.మహేష్‌బాబు, సురేష్‌కుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్లల్లో కారం చల్లి.. ఫైనాన్షియర్ కిడ్నాప్



కిడ్నాప్‌కు గురైన వేణు గోపాల్‌రెడ్డి (ఫైల్)



వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో ప్రముఖ ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డిని కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. శుక్రవారం రాత్రి స్కూటీలో ఇంటికి వస్తుండగా దారి మధ్యలో కాపు కాచిన దుండగులు కళ్లలో కారంపొడి చల్లి కిడ్నాప్ చేసి కారులో తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొల్లవరం ప్రాంతానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి కొన్నేళ్ల క్రితం జమ్మలమడుగు రోడ్డులోని బొల్లవరం మున్సిపల్ ప్లాట్‌లలో విశాలమైన భవంతి నిర్మించుకొని అక్కడే ఉంటున్నారు. ఆయన వడ్డీకి అప్పులిస్తుంటాడు. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలు కావస్తున్నా ఇంటికి రాకపోవడంతో కుమార్తె స్వప్న వేణుగోపాల్‌రెడ్డికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌లో ఉంది. మరో నంబర్ అందుబాటులో లేదు. కొద్ది సేపటి తర్వాత వాచ్‌మెన్ బయటికి వెళ్లి చూడగా జమ్మలమడుగు రహదారిలోని ఆర్చి వద్ద వేణుగోపాల్‌రెడ్డి స్కూటీ కిందపడిపోయి ఉంది. వాచ్‌మెన్ కేకలు వేయడంతో ప్రమీలాదేవి, కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చారు. స్కూటీ పక్కనే వేణుగోపాల్‌రెడ్డి చెప్పులతోపాటు కారంపొడి పడి ఉండటంతో ఎవరో ఆయనను కిడ్నాప్ చేశారని భావించిన కుటుంబ సభ్యులు బోరున విలపించసాగారు. రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి రాత్రంతా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కొందరు వ్యక్తులు కారులో వేణగోపాల్‌రెడ్డిని ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. ప్రమీలాదేవి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. తమకు డబ్బు ఇవ్వాల్సిన వాళ్లే తన భర్త వేణుగోపాల్‌రెడ్డిని కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లి ఉంటారని ప్రమీలాదేవి తెలిపారు. తమకు బాకీ ఉన్నవాళ్లు తన భర్తకు హాని తలపెట్టేలా ఉన్నారని ఆమె రోదించింది.

భూసేకరణ రద్దు కోరుతూ 24న చలో విజయవాడ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెద్దముడియం, మైలవరం మండలాల్లో సోలార్ ప్రాజెక్టుకు రైతుల నుంచి బలవంతపు భూసేకరణ రద్దు చేయాలని ఈ నెల 24న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు బి.దస్తగిరి రెడ్డి, అన్వేష్ తెలిపారు. శనివారం కార్యక్రమ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కల్వటాల, గోవిందపల్లి, వద్దిరాల గ్రామాల్లో భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. భూములు ఇవ్వకపోతే అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపడం దుర్మార్గం అన్నారు. ఇందుకు నిరసనగా విజయవాడలో నిర్వహించే మహా ధర్నాకు రైతులు తరలిరావాలని ఆయన కోరారు. రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, పాల్గొన్నారు.

23న మున్సిపల్ కార్మికుల సమస్యలపై..

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయభాస్కర్, నాగేంద్ర కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రభుత్వం అనేక రకాల హామీలిచ్చి నెరవేర్చలేదన్నారు. 12వ పీఆర్సీ, పర్మనెంట్, సమ్మె కాలపు వేతనం, సంక్షేమ పథకాలు, బదిలీ, కోవిడ్ గార్బేజీ, క్లాప్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపి, విజయ్‌కుమారు కార్మికులు పాల్గొన్నారు.